ముఖా ముఖి:

# దొంగతనంలోని చిక్కులు

"ప్ర సీ ల్"

(ప్రదేశం ఆర్మీరెక్రూటింగ్ ఆఫీసర్ ఇంటిలో గది. దొంగ గదిలోకి ప్రవేశిస్తాడు. ఆఫీసర్ మంచంమీద నిద్రపోతుంటాడు. పక్కనే బల్ల మీద గడియారం 12 చూపుతుంది, మెల్లి మెల్లిగా అడుగులు వేసుకుంటూ వచ్చి లైటు స్విచ్ ఆన్ చేసి పిస్తోలు చూపిస్తూ ఆర్మీరెక్రూటింగ్ ఆఫీసర్‌ను లేవమంటాడు దొంగ.)

ఆ. రె. ఆ:—అ. ఏమిటి? అబ్బబ్బ. ఎంత మంది. ఎంతమంది? వెధవ ఉద్యోగము వెధవ ఉద్యోగ మాని——

దొంగ:— నేను——

ఆ. రె. ఆ:- సరే. నీవయసెంత?

దొంగ:- అదికాదు———

ఆ. రె. ఆ:- వయసు చెప్పు. ఊం. త్వరగా. ఇంకా ఎంతమంది వున్నారో!

దొంగ:- నువ్వు——

ఆ. రె. ఆ:- (గట్టిగా ఆజ్ఞాపిస్తున్నట్లు) వయసు.

దొంగ:- (అదురుకొని) ఇరవై తొమ్మిది.

ఆ. రె. ఆ:- పెండ్లి ఐందా?

దొంగ:- లేదు.

ఆ. రె. ఆ:- పిల్లలేంత మంది?

దొంగ:- లేరు.

ఆ. రె. ఆ:- పెండ్లీ, పిల్లలూ లెకుండా ఆర్మీలో ఎట్లాచేరుదామనుకున్నావోయ్?

దొంగ:- నే నందుకోసం కాదు వచ్చింది.

ఆ. రె. ఆ:- మరెందుకు? నిన్ను గేట్‌ప్యూన్ ఎట్లారానిచ్చాడు?

దొంగ:- కళ్ళు తెరువు బాబు, నేను దొంగని. సైన్యంలో చేరటానికి రాలేదు.

ఆ. రె. ఆ:- (ఇంకా కళ్ళుమూసుకొని) ఆర్మీలో చేరటానికి కాకపోతే నిన్నసలు గేట్ ప్యూన్ ఎలా రానిచ్చాడు? దొంగలకు ప్రవేశం లేదే ఈ రూములోకి. ఏయ్ గేట్‌ప్యూన్! వీణ్ణి ఎలారానిచ్చావోయ్?

దొంగ:- ఇదుగో. మాటలు తిన్నగారానీ. 'వీడు, గీడు' అన్నావంటే——

ఆ, రె. ఆ:- అరె. గెట్ అవుట్. ఒరేయ్ ప్యూన్! 'నెకవుట్ దిస్‌ఫెలో' (దొంగ ఒకానొక ప్పుడు నిరుద్యోగ సమస్యలో తన్నుకులాడిన ప్పుడు ఈ పైఇంగ్లిష్ ముక్కలు వినగానే ఆఫీస్ లోనుంచి కాళ్ళకు బుద్ధిచెప్పిన అలవాటు చొప్పున అక్కడినుంచి పరిగెత్తుతాడు.)

* * *

(ప్రదేశం: కవి గది. 1 గంట. మెల్లమెల్లగా దొంగ ప్రవేశిస్తాడు)

దొంగ:- (యీజీచైర్‌లో పడుకొన్న కవిని లేపుతూ) కవీ!

కవి:- ప్రేయసీ! కనుపించితివా? కరుణ కల్గెనా?

దొంగ:- మహాశయా! మీ ప్రేయసికి నాపోలిక లేమైనా వున్నవేమోకాని, నా మటుకు నేను దొంగని.

కవి:- దొంగవా? దొంగ వైతేనేమి దొరవైతే నేమి? నువుమాత్రం మనిషివికావూ?

దొంద:- దొంగలకు మానవత్వం చచ్చిపో తుంది,

కవి:- అబద్ధం.

దొంగ:- దొంగ నిజం చెప్తాడని ఎవడను కోమన్నాడు బాబూ?

కవి:- ఐతే నీకు హృదయంలేదూ?

దొంగ:- దొంగలెకు హృదయాలుండవని మీకు తెలీదూ?

కవి:- సర్వమానవ కళ్యాణానికి నా రాతలతో పాటుపడుతున్నటు వంటి నేను, దొంగలకు హృద యాలు లేవంటే నమ్ముతానా?

దొంగ:- నేను వచ్చిన పని———

కవి:- కాస్త ఆగు. ముందర నాపని సంగతి చూడాలి.

దొంగ:- మీ పనా?

కవి:- ఆ. అవును.

దొంగ:- నేను దొంగనని తెలిస్తే మీరిట్లా మాట్లాడరు.

కవి: సర్వమానవ కళ్యాణానికి పాటుబడుతున్న కవినని తెలిస్తే నువ్వసలు అట్లా మాట్లాడవు.

దొంగ:- కవీజీ! జాగ్రత్త!

కవి:- అదుగో. కోప్పడాక. (ఏడ్పుగొంతుతో) నా ప్రేయసి నన్ను విడనాడినది. ననుచేపట్ట నిరాకరించినది. నాకీ జీవితముపై విసుగు కల్గినది. జీవిత ఆకాశమందలి ఒక ఆశాజ్యోతికూడ ఆరిపోయె. ప్రేయసికి ఉత్తరము రాయుదుమన్న మూడుకానులైన లేవాయె. మరియూ——

(దొంగకు హృదయముందో లేదో తెలీదుగాని రూపాయి కవి చేతులో పెట్టి బయట పడ్డాడు.)

* * *

(ప్రదేశం—ఒక రాజకీయ పక్షనాయకుడి ఇల్లు – కాలం 2 గంటలు, దొంగ, నాయకుణ్ణి తట్టి లేపుతాడు.)

రాజ:- ఆ! ఎవరది?

దొంగ:- (మాట్లాడటంవల్ల ప్రయోజనం లేదని గ్రహించిన దొంగ, మొహం కఠినంగా పెట్టుకోని నుల్చోనుంటాడు)

రాజ:-వెధవగోల వెధవగోలాసి—ఎవరోయ్ నువ్వు?

దొంగ:—(కోపంతో) నోర్ముయ్. నేను దొంగని.

రాజ:-ఇంత రాత్రప్పుడు నిద్ర ఎట్లా లేపావోయ్, బేవకూఫ్? దొంగట. దొంగలేదు గింగాలేదు. ఫో ఫో.

దొంగ:-(ఆశ్చర్యం).

రాజ:-అరే, పొమ్మని నీగ్గాదూ చెప్పేది? వెధవలు, మరీ ఎక్కువై పోతున్నారు.

దొంగ:-(వికారంగా) అంటే మీ వృత్తిలో పోటీదారుణ్ణనా?

రాజ:-ఏడిశావ్. మహా పెద్దమాట అన్నావ్—! దిట్టంగా వున్నావ్. ఏదన్నా పని ఏడవరాదూ?

దొంగ:-ఒకదేశ నాయకుణ్ణి అవనా?

రాజ:-అదుగో, ఆమాట అన్నావు. బాగుంది నీకీవృత్తి ఏం పెట్టుంది చెప్పు. ప్రతివాడికీ భయపడుతుండాలె. పట్టుబడితే జైలు. నేను చెప్పినమాట విని మా పార్టీలో చేరు. నిన్ను నిమిషంలో దేశనాయకుణ్ణి చేస్తాను. అప్పుడు: జైలుకెళ్లినా, గౌరవం. (ఉపన్యాస ధోరణిలో) దేశచరిత్రయందు నీ నామము సువర్ణాక్షరంబులతో లిఖింపబడును. నీ కీర్తి యావద్భారత దేశమునందు వ్యాపించి, వ్యాపించి....(మాట అందక) ఇవన్నీ జరుగుతై.

దొంగ:-అక్కర్లేదు-నాకీ వృత్తే సుఖంగా వుంది.

రాజ:-ఆలోచించుకో డబ్బు, సుఖం, హోటేళ్లు, నవయౌవనంలో వున్న....

దొంగ:-చాల్లే. ఆగు. నీ దగ్గర-డబ్బు ఏ మాత్రం....?

రాజ:-దేశసేవకు జీవితం ధారవోస్తున్న దేశ నాయకుని దగ్గర డబ్బు ఏం వుంటుంది బ్రదర్?

* * *


## ఆనందవాణి

★

రచయితలు చాలామంది తాము పంపించిన రచనలు ప్రకటింపబడతాయో లేదో తెలియక చాలా తహతహపడుతూ వుంటారు.

మీ రచనలతో బాటు పోస్టుబిళ్ళలు కూడా పంపిస్తే సాధ్యమైనంతత్వరగలో ప్రకటించేవీ లేనిదీ తెలియబరుస్తూ, ప్రకటించడానికి వీలులేనియెడల సదరు రచనలు త్రిప్పి పంపబడును.

ఆనందవాణికి ఏజంట్లు, చందాదార్లు మెంబరయ్యేవారు పంపించే మనియార్డర్లు వ్యక్తులపేర గాకుండా "మేనేజరు, ఆనందవాణి, నెం. 12, తంబుచెట్టి వీధి, మద్రాసు" అని వ్రాసి పంపవలెను.

(ప్రదేశం: వకీలుఇల్లు. కాలం తెల్లవారుఝాము.)

దొంగ:-వకీలుగారూ! లేవండి.

వకీలు:-లేవను.

దొంగ:-(రెండు భుజాలు పట్టుకొని కూచో బెట్టి) కళ్లు తెరవండి.

వకీలు:-ఎందుకు?

దొంగ:-డబ్బుకావాలి.

వకీలు:-ఐతే?

దొంగ:-అందువల్ల లేవాలి.

వకీలు:-లేవకపోతే?

దొంగ:-తంతాను.

వకీలు:-తంతే?

దొంగ:-నీకు వొళ్లు నెప్పులు వస్తై.

వకీలు:-వచ్చి?

దొంగ:-బాధపడ్తావు.

వకీలు:-పడి?

దొంగ:-ఛస్తావ్.

వకీలు:-పీడా వొదుల్తుంది. దాన్తో, దాని ఎత్తిపొడుపులు ఆగిపోతై. డబ్బు సంపాయించటం లేదట-దానిమొహం. ఎన్నేళ్ళేడిస్తే మాత్రం ఈ వెధవవృత్తిలో ఏమొస్తుంది?

దొంగ:-నిజమే.

వకీలు:-ధనం సంపాయించటానికి ఈ వకీలు వృత్తే ఏడవాల్సని ఎక్కడున్నది? హాయిగా, సుఖంగా, పగలల్లా నిద్రపోతూ, రాత్రిళ్లు చేసుకుండే నీ వృత్తి ఎంత గౌరవదాయకం?—వెధవ డబ్బు. మొన్న ఆ "బ్లూరిబ్బన్" గనక గెల్చినట్లయితే రూపాయల గోతితవ్వి మొగుడూ పెళ్లాం ఇద్దరం గోతిలో గోరీ కట్టించుకుండే వాళ్లం గాదూ?

దొంగ:-(శ్రద్ధగా) మీరసలు 'గోల్డెన్ఈగల్' మీద కట్టినట్లయితే బాగుండేది.

వకీలు:-అనుకున్నాను. కానీ...వాడి దుంపతెగ నిష్ఠదరిద్రుడు. మా సబ్ జడ్జి ఆ "బ్లూరిబ్బన్" మీదే కట్టటం మంచిదన్నాడు.

దొంగ:-అసలు నిజంగా "మెర్క్యూరీ" గెల్చి వుండాల్సింది. నేను దానిమీదనే కట్టాను. జాకీలందరూ షరీకై ఒక్కొక్కసారి ఒక్కొక్క గుర్రాన్ని గెల్పిస్తారనే సంగతి నాకేం తెలుసు?

వకీలు:-నేను, ఆ మధ్య ఒక జ్యోతిష్కుణ్ణి పిలిపించి వాడితో మాట్లాడి, వాడికి 15 రూపాయలర్పించి, వాడు "లైట్నింగ్" గెలుస్తుందంటే, ఆ రోజున "లైట్నింగే" గెలిచింది.

దొంగ:-(ఆత్రం) ఎంతొచ్చింది?

వకీలు:-ఏమీ రాలేదు.

దొంగ:-ఆ. మరి........

వకీలు:-నేనసలు దానికి కట్టలేదు.

దొంగ:-అంటే?

వకీలు:-వాడి దుంపతెగ వాడే.

దొంగ:-ఎవరు?

వకీలు:-వాడే ఆ సబ్ జడ్జి. జ్యోతిష్కుల్ని నమ్మటమేమిటి? "గ్రీన్‌లైట్" మీద కట్టు. ఐదువేలు నీ చేతుల్లో పడకపోతే చూడమన్నాడు. బుద్ధిగడ్డి తిని....

దొంగ:-సరే పదండి. ఆ సబ్ జడ్జి పని మన చేతుల్లో మూడింది.

వకీలు:-పదండి ముందుకు. పదండి....

---

పత్రికా స్వీకారము

ఆంధ్రజ్యోతి మాసపత్రికరూపంలో క్రొత్త రూపంతో తొలిపంచిక మా కార్యాలయం అలంకరించింది. శ్రీ చక్రపాణి సంపాదకత్వం కింద, సమర్థులైన వివిధ రచయితల అమూల్య వ్యాసాలతోను, వ్యంగ్య చిత్రాలతోను అలరారు తున్నది. 84 పేజీలు. సంచిక వెల 6 అ.

---

ఇళ్లన్నీ కేవలం
టి. టి. ఇంగువమయం
సైన్సుపికె
టి టి
మిస్కి యింగువ